# ఇన్లాండ్ లెటర్ కథలు

## మనోవైకల్యం

చేతిలో సూట్‌కేస్ పట్టుకుని గబగబా నడుచుకుంటూ శేఖర్ ఆటోస్టాండ్‌కి వచ్చాడు. సెకండ్‌షో మొదలయ్యే సమయమేమో స్టాండ్‌లో ఒక్క ఆటో కూడా లేదు. ఐదు నిమిషాలు చూసాడు. అతని ప్రయత్నమేది ఫలించలేదు. ఒక్క ఆటో కూడా రాలేదు. చిరాగ్గా ఒకసారి వాచ్ చూసుకున్నాడు. తొమ్మిదవుతుంది. డిశంబర్ నెల కావడంతో చలి చాలా ఎక్కువగా వుంది.

శేఖర్ చుట్టూ చూశాడు. కనీసం రిక్షా అయినా దొరుకుతుందేమోనని. అదృష్టం...అన్నట్టు దూరంగా చెట్టు క్రింద రిక్షా తనకోసమే ఆగివున్నట్టుంది. చలికి దుప్పటి లాంటిది కప్పుకుని రిక్షావాడు ముడుచుకుని కూర్చుని వున్నాడు. శేఖర్ గబగబా వెళ్లి "ఏయ్ రిక్షా! స్టేషన్‌కి వస్తావా? ఎంతివ్వమంటావ్? కాస్తంత ఆతృతగా అడిగాడు.



'పన్నెండు రూపాయలు ఇప్పించండయ్యా' అన్నాడు రిక్షావాడు.

'ఏమిటయ్యా నేనేమైనా యీ వూరికి కొత్తవాడిననుకున్నావా? నీ ఇష్టం వచ్చినంత అడుగుతున్నావు ఎనిమిది యిస్తాను అన్నాడు శేఖర్.

పది ఇప్పించండయ్యా! దీనంగా అడిగాడు రిక్షావాడు.

అసలే కోపంతో వున్న శేఖర్ 'తొమ్మిది రూపాయలు యిస్తాను వస్తే రా! లేకుంటే మరో రిక్షా చూసుకుంటాను' శేఖర్ రవ్వంత కోపంగా అన్నాడు.

బేరం వదులుకోవడం ఇష్టంలేక రిక్షావాడు 'ఎక్కండయ్యా' అని శేఖర్ ఎక్కి కూర్చున్న తర్వాత నెమ్మదిగా రిక్షా తొక్కసాగాడు.

శేఖర్‌కి విసుగ్గా వున్నది. నాన్నగారు చెప్పినట్లు గంటముందు బయలుదేరవలసింది. రిక్షాతో ట్రైన్ అందుకోగలనో లేదో! ఎల్లుండే మద్రాస్‌లో ఇంటర్వ్యూ. ఈ వుద్యోగం మీదనే తను ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు.

ఆలోచనల నుంచి తేరుకుని టైం చూసాడు తొమ్మిది దాటి పది నిమిషాలయింది.

"బాప్‌రే" మరొక్క పదినిమిషాల్లో బండి వచ్చేస్తుంది.

'ఏయ్! ఏమిటా రిక్షా తొక్కడం? నేను నడచి వెళ్లుంటే ఈ పాటికి స్టేషన్ చేరుకునేవాడిని నత్తనడకలు మాని కాస్త త్వరగా పోనీ' గట్టిగా అన్నాడు శేఖర్.

బలమంతా కాళ్లలోకి తెచ్చుకున్నట్టు రిక్షావాడు గబగబా తొక్కుతున్నాడు. రిక్షా కాస్త జోరందుకుంది.

ఎలాగయితేనేం గమ్యస్థానం చేరుకుంది రిక్షా.

"కాస్త ఆ లైటు దగ్గర ఆపుచెయ్. డబ్బులు చూసి ఇవ్వాలి" అన్నాడు శేఖర్.

రిక్షా ఆగింది. పర్స్ తీసి సరిగ్గా తొమ్మిదిరూపాయలు లెక్కపెట్టి...ఇదిగో నీ డబ్బు...మాట పూర్తి చేయకుండానే విభ్రాంతిగా శేఖర్ చూస్తూ వుండిపోయాడు. రిక్షావాడి కుడిచేయి స్థానంలో షర్ట్ వదులుగా వూగుతున్నది. అంటే .. మైగాడ్! ఒక్క చేత్తో రిక్షా నడిపిస్తున్నాడా? అందుకే అన్నమాట రెండుభుజాల మీద కప్పుకున్నాడు. అతని అంగవైకల్యం కూడా గుర్తించకుండా తనెంత అమానుషంగా ప్రవర్తించాడు. శేఖర్ కళ్లు అప్రయత్నంగా చెమ్మగిల్లాయి.

"అతడి అంగవైకల్యం కన్నా తన మనో వైకల్యమే చాలా ఎక్కువనిపించింది". శేఖర్ పర్స్ తీసి పదిహేను రూపాయలు రిక్షావాడి చేతిలో పెట్టి గబగబా స్టేషన్‌లోపలికి నడిచాడు.

—డి.స్వర్ణశైలజ,
ఖరగ్‌పూర్, వెస్ట్‌బెంగాల్.

## వల

ఎదురింట్లోకి ఈ మధ్య ఓ కొత్తాయన అద్దెకు దిగాడు.

ఏ ఊరో తెలియదు కాని, నల్లగా వుంటాడు. చురుకైన కళ్లు. నవ్వు మాత్రం మతాబులా వెలుగుతూ ఆరుతూ వుంటుంది.

అతని వయసు నాలుగు పదులు మించి వుంటుంది. చూపరులను యిట్టే ఆకట్టుకునే వాక్చటిమ వుంది.

వరండాలో కూర్చొన్నప్పుడల్లా గళ్ల లుంగీ కట్టుకుని, చేతులు బనీను వేసుకుని కాంపౌండ్‌లో పచార్లు చేస్తూ వుంటాడు.

పుట్టి పెరిగిన ఈ వూరి వాళ్లే నాకు పూర్తిగా తెలియదు. అతను వచ్చి వారం రోజులయిందో లేదో వాడకట్టు వాళ్లకి తలలో నాలుక అయ్యాడు.

ఎదురింటాయన గురించి వాకబు చెయ్యగా, ఏదో వ్యాపారం మీద ఇక్కడకు వచ్చాడట. పెళ్లాం బిడ్డలను వదిలేసినట్టు మాత్రం నాకు చూచాయగా తెలిసింది.

అతను ఇరుగుపొరుగు వాళ్లతో షరసలు కలిపి గంటల తరబడి మాట్లాడుతుండేవాడు. అయనంటే వూరివాళ్లకు మంచి వాడని ఓ అభిప్రాయం ఏర్పడింది అప్పడే!

పంపునీళ్లకు వచ్చేపోయే ఆడవాళ్లు అతని కంట్లో పడాలని ఆరాటపడేవాళ్లు. కానీ అతని ప్రవర్తన నాకు అతిగాను, వింతగానూ తోచసాగింది.

అలా కొన్నాళ్లు గడిచాయి. రాత్రివేళ బజారు నుండి నేనింటికి వస్తుంటే ఏవో శాల్తీలు చీకటిలో కదిలినట్లు అనిపించాయి. పరీక్షగా చూస్తే వారిని గుర్తు పట్టగలిగాను. ఎదురింటాయన ప్రవర్తన మీద నాకు మొదటిసారిగా అపనమ్మకం కలిగింది. వారిద్దరి గురించి రాత్రంతా ఆలోచిస్తూ వుండిపోయాను.

తెల్లారె సరికల్లా రాత్రి జరిగిన వార్తను భుజాన వేసుకొచ్చాడు నా మిత్రుడు.

"ఎదురింటాయన మొగుడొదిలేసిన సుబ్బమ్మ పెళ్లి చేసుకోబోతున్నారని బాంబు పేల్చాడు."

రాత్రి జరిగిన సంఘటనను వాడికి పూస గ్రుచ్చినట్లు చెప్పాను. రఘుపతి వాగ్ధాటికి నేను ఆపలేకపోయాను. వాళ్లిద్దరు ఇష్టపడి పెళ్లి చేసుకుంటుంటే మనమేమి చేస్తామని ముగించాను ఇక చేసేది లేక.

సుబ్బమ్మ పదో తరగతి వరకు చదివింది. అందంతో పాటు కించిత్ గర్వం కూడా వుంది. నవలలు, వీక్లీలు చదివే అలవాటు వుంది. ఆమె తెలివితేటలు గల పిల్ల.

పనీ పాటా చేసుకునే బంధువుల బ్బాయి కిస్తే, వాడితో కాపురం చెయ్యనని వచ్చి పుట్టింటి దగ్గర వుంటుంది సుబ్బమ్మ. ఎదురింటాయనలో ఈమెకెలా దోస్తీ కుదిరిందో నాకు అర్థం కాలేదు. అందరు అనుకున్నట్టుగానే వాళ్లు పెళ్లి చేసుకున్నారు.

వారం రోజులు సినిమాలు, షికార్లని తిరిగారు. తిరుపతి వెళ్లొస్తామని వెళ్లారు. అంతే మళ్లీ వారి జాడ లేదు. ఎదురింటాయనకు అప్పులవాళ్లు వచ్చి తమ గోడు చెప్పుకుంటున్నారు. అతని నైజం ఇంటి ఓనరుకి నిదానంగా తెలిసింది. ఊరంతా ఒక్కసారిగా గుప్పుమంది. తీసుకెళ్లిన సుబ్బమ్మను ఏం చేస్తాడో అని సుబ్బమ్మ తల్లిదండ్రులు ఆందోళన పడుతున్నారు.

నెల రోజుల తర్వాత చిలకలూరిపేట నుంచి ఓ ఉత్తరం వచ్చింది. సుబ్బమ్మ తల్లిదండ్రులకు. "అమ్మా! వాడు నన్నిక్కడే అమ్మేశాడు. నేను మోసపోయాను" అని రాసుంది.

—జి.సూర్యనారాయణ రావు,
బందలాయిచెరువు.